సాక్షి తిరుపతి

ఆదివారం। 10। మార్చి। 2024



'సిద్ధం' విజయవంతం చేద్దాం

మేదరమెట్లలో నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేద్దామని తుడా చైర్మన్ పిలుపునిచ్చారు. - IIలో



మత్స్యకారులకు మంచిరోజులు

తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులకు మంచి రోజులు వచ్చినట్లు కలెక్టర్ లక్ష్మీ శ శనివారం తెలిపారు. - IIలో



వైభవంగా పల్లికొండేశ్వరుడి కల్యాణం

సురుటుపల్లెలోని పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

రేపు తిరుపతిలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ : బాలాజీ కాలనీలోని గాయత్రీ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అపోలో ఫార్మసీ ప్రతినిధులు మేళాకు హాజరై సుమారు 100 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు రావచ్చన్నారు. ఇతర వివరాలకు 7989810194 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 683 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా 87 కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 683 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మ్యాథ్స్–1బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు పరీక్షలు చేపట్టగా 30,294 మంది విద్యార్థులకు గాను 29,611మంది హాజరైనట్లు వివరించారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్–2బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మహిళా వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్‌లో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బిజినెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ డిజిటల్ వరల్డ్ అనే అంశంపై నిర్వహించే రెండు రోజుల అంతర్జాయ సదస్సు శనివారం ప్రారంభమైంది. వీసీ భారతి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ డిజిటల్ విప్లవంలో భాగంగా వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వ్యవస్థాపకులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రపంచంతో ఇంటరాక్ట్‌కు, బిజినెస్ డెవలప్‌మెంట్‌కు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించినప్పుడే ఆర్థిక స్థిరత్వాన్ని సాధించగలమని వెల్లడించారు. ప్రభుత్వాలు, కార్పొరేట్, విద్యాసంస్థలు సంయుక్తంగా నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు స్టార్టప్‌లు అమలు చేయాలంటే వ్యవస్థాపక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని వివరించారు. సదస్సులో రిజిస్ట్రార్ రజని, ఏఎస్‌రావు, ప్రొఫెసర్ కాత్యాయని, విజయలక్ష్మి, కోకిల వాణి, డాక్టర్ గణేష్ సుబ్రమణ్యన్, కత్రోడియా, బి.రమేష్, మహేష్ పవన్, కళారాణి, నిషఅయేది, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

12న శబరిమలైకి నూతన ఎక్స్‌ప్రెస్ రైలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి నుంచి కేరళలోని శబరిమలై ఆలయానికి ఈనెల 12న నూతనంగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు వారానికి రెండు సార్లు తిరుపతి నుంచి కేరళలోని శబరిమలై సమీపంలోని కొల్లాం వరకు నడుస్తుందని పేర్కొన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు బయలుదేరి చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, కోయంబత్తూరు, త్రిషూర్, ఆలువా, ఎర్నాకుళం, కొట్టాయం, కాయంకుళం, చంగనసేరి, మావెలికర మార్గంలో కేరళలోని కొల్లాంకు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే కొల్లాం నుంచి బుధ, శనివారాల్లో తిరుపతికి బయలుదేరి అదే రైలు చేరుకోనుందని అధికారులు వెల్లడించారు.

రమణీయం.. రథోత్సవం



ఊరేగుతున్న శివపార్వతులు (ఇన్‌సెట్) రథం లాగుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకాళహస్తి క్షేత్రంలో ముక్కంటి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. శివపార్వతుల నామస్మరణతో దక్షిణ కైలాసం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లింది. రథారూఢులైన స్వామి, అమ్మవార్లను సేవించి భక్తజనం పులకించింది. ఆదిమధ్యాంతర హితుని దివ్యతేజస్సును వీక్షించి పునీతమైంది. శక్తిస్వరూపిణి మహిమాన్విత స్వరూపాన్ని దర్శించి తరించింది. ఈ క్రమంలోనే రాత్రి నారద పుష్కరిణిలో వాయులింగేశ్వరుడు.. జ్ఞానప్రసూనాంబ తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. విద్యుద్దీప కాంతుల నడుమ తెప్పలపై కొలువుదీరిన తేజోమయ మూర్తులు కోనేరులో ఐదు ప్రదక్షిణలు చేశారు. నయనానందకరంగా సాగిన మహోత్సవాన్ని భక్తులు మనస్సులో నిక్షిప్తం చేసుకుని తన్మయత్వం చెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి



తెప్పలపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో ముక్కంటీశుడు

పవిత్రం.. లింగోద్భవం


మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం వేకువజామున లింగోద్భవ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను పవిత్ర లింగోద్భవ దర్శనానికి అనుమతించారు.

నేడు శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కనులపండువగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.

> **ఆధ్యాత్మికాభివృద్ధి**
> దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తున్నాం. పురాతన ఆలయాలకు పునర్వైభవం తీసుకువచ్చాం. స్వర్ణముఖిని ప్రక్షాళన చేశాం. కరకట్టను సుందరవనంగా తీర్చిదిద్దాం. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశాం. ఆలయ పాలకమండలిలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం.
> – బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

జోడీ అలజడి!



టీడీపీ నేతల్లో అసహనం తారస్థాయికి చేరింది.. అధినేత తీరుతో నైరాశ్యం అలుముకుంది.. జనసేనతో జోడీ కట్టినప్పుడే కలవరం మొదలైంది.. మళ్లీ కమలదళంతో జట్టు కుదరడం అసమ్మతికి మరింత ఆజ్యం పోసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గందరగోళం నెలకొంది.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త పొత్తు చిచ్చురేపుతోంది.. నోటిఫికేషన్ ముందే తమ్ముళ్లను ఓటమి భయం వెంటాడుతోంది.. తాజా పరిణామాలను గమనిస్తున్న ఆశావహుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.. ఇదే పరిస్థితి జనసైనికుల్లోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.. అరువు నేతలను తీసుకురావడంపై నిరసన వెల్లువెత్తుతోంది.

- టీడీపీ.. జనసేనలో పొత్తుల గుబులు
- చిత్తూరు, తిరుపతిలో 'ఆరణి' మంటలు
- సూళ్లూరుపేటలో వేనాటి తిరుగుబావుటా
- జీడీ నెల్లూరులో శ్రేణులకు అవమానాలు
- నగరి, సత్యవేడు నేతల్లో గందరగోళం
- వెంకటగిరిలో బాబు దాగుడుమూతలు

సాక్షి, తిరుపతి : టీడీపీ, జనసేన అధినేత తీరుతో ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర అలజడి మొదలైంది. ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలతో టీడీపీ శ్రేణులకు నోటిఫికేషన్‌కు ముందే ఓటమి భయం పట్టుకుంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పటి నుంచి ఆ పార్టీకి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన వేనాటి రామచంద్రారెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి కినుక వహించారు. వేనాటి రామచంద్రారెడ్డి ఒక్క అడుగు ముందుకేసి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు నిర్ణయించారు. సూళ్లూరుపేట రాజకీయాల్లోకి చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొండేపాటి గంగాప్రసాద్ వచ్చాక వేనాటివారి ప్రాభవం తగ్గించారనేది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితుల్లో వేనాటి రామచంద్రారెడ్డి కుమారుడు సుమంత్ రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ పర్యాయం తనొక్కడే కాకుండా కుటుంబసభ్యులు, అనుచరులను కూడా పార్టీలో చేర్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా తన కార్యాలయం ముందు, సూళ్లూరుపేట పట్టణం అంతా సిద్ధం బ్యానర్లను ఏర్పాటు చేసి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

తమ్ముళ్లకు అవమానాలు

గంగాధరనెల్లూరు, నగరిలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అవమానాలు తప్పడం లేదు. ఎన్నికల ప్రచారం కోసం తనతో తిరిగేందుకు స్థానికులు ముందుకు రాకపోవడంతో టీడీపీ అభ్యర్థులు తమిళనాడు నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు. వారికి రోజూ రూ.750 చెల్లిస్తున్నారు. ఈ పంపిణీ బాధ్యతలను స్థానిక టీడీపీ శ్రేణులను నమ్మని అభ్యర్థులు.. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా నియమించుకున్న వారికి బాధ్యతలు అప్పగించారు. దీనిపై తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమనను నమ్మనప్పుడు ఎన్నికల్లో పనిచేయలేమని చేతులెత్తేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్, ఆ పార్టీ నాయకులు పచ్చపత్రికల విలేకరులను పిలిపించుకుని భారీ ఎత్తున డిన్నర్ ఏర్పాటు చేసి, వారి చేతిలో కొంత నగదు పెట్టి ఎన్నికల్లో సాయం చేయమని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నేతలకు ఎమ్మెల్యే ఆదిమూలం తలనొప్పులు ఎక్కువయ్యాయి.



సూళ్లూరుపేటలో సుమంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వెంకటగిరిలో సర్వే నాటకాలు

వెంకటగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు సర్వేల పేరిట దాగుడు మూతలాడుతున్నారు. మొన్నటి వరకు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేరుతో సర్వే చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె, మస్తాన్ యాదవ్ పేర్లతో సర్వే చేయిస్తున్నారు. దీంతో స్థానిక టీడీపీలో గందరగోళం నెలకొంది.

తిరుపతి, చిత్తూరులో అసమ్మతిరాగం

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలోకి రాక ముందు.. కొన్నాళ్లు టీడీపీలో, ఆ తర్వాత ప్రజారాజ్యంలో చేరి ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించారు. చంద్రబాబు సీటు ఇవ్వకపోవడంతో ఆరణి శ్రీనివాసులు టీడీపీకి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీలో చేరి తొలుత ఓడిపోయారు. మళ్లీ 2019లో ఫ్యాన్ గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులు ఈ ఐదేళ్ల కాలంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కోవడంతో ఈ సారి వైఎస్సార్‌సీపీ ఆయనను పక్కనపెట్టింది. దీంతో ఆరణి శ్రీనివాసులు టీడీపీలో చేరేందుకు విఫల యత్నం చేశారు. చివరకు కాపు కార్డుతో జనసేనలో చేరాడు. తిరుపతి టికెట్ తనకే కావాలని పట్టుబడుతున్నారు. ఈ పరిణామాన్ని చిత్తూరు, తిరుపతికి చెందిన జనసేన శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే.. పొత్తులో భాగంగా తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించడంపై టీడీపీలోని ఆశావాహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> 'పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు టీడీపీ గుర్తు లేకుండా ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. అటువంటి పార్టీకి ఈ ఎన్నికల్లో గుర్తే లేకుండా చేస్తారా..?. ఇవేం పొత్తులు..? ఇలా అయితే మేం చేయలేం' అంటూ టీడీపీ నేతలు తెగేసి చెబుతున్నారు. ఒక వేళ కాదు కూడదు అంటే మేం దూరమవుతామని కరాఖండీగా చెప్పేస్తున్నారు.

బైబై బాబు!

- తిరుపతిలో గుర్తే లేకుండా చేస్తారా?
- ఇలా ఐతే మేం పనిచేయలేం
- తిరుపతిలో టీడీపీ నేతల అత్యవసర సమావేశం
- శ్రీకాళహస్తిలో బొజ్జల కుటుంబం ఆందోళన

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకోవడంపై కొందరు నాయకులు రగిలిపోతున్నారు. రెండుమూడు రోజుల్లో సీట్ల కేటాయింపు ఖరారు కానుండడంతో టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం ప్రకారం తిరుపతి పార్లమెంట్, అసెంబ్లీ నుంచి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుపతి అసెంబ్లీ ఇప్పటికే జనసేనకు కేటాయించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా బీజేపీతో పొత్తు కుదరడంతో తిరుపతి పార్లమెంట్ టికెట్ కూడా టీడీపీకి దక్కే పరిస్థితి లేదని తేలిపోయింది. దీనిపై తిరుపతి టీడీపీ నేతలు శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకించాలని నిర్ణయించారు. తిరుపతి ఎంపీ లేదా? అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకటి టీడీపీ అభ్యర్థి ఎవరో ఒకరు పోటీ చేయాలి? ఆరణి శ్రీనివాసులుకు కాకుండా తిరుపతికి చెందిన నేతనే జనసేన అభ్యర్థిగా పోటీకి దింపాలి.. అని తీర్మానాలు చేసినట్లు సమాచారం.

శ్రీకాళహస్తిలో బొజ్జల ఆందోళన

ప్రస్తుతం శ్రీకాళహస్తి అసెంబ్లీ కూడా టీడీపీ వదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే జరిగితే టికెట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎస్సీవీ నాయుడు ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లినట్లేనని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

ప్రజల సౌకర్యం కోసమే

'ఫుట్ ఓవర్ బ్రిడ్జి"



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే భూమన , ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి(అలిపిరి): ప్రజల సౌకర్యం కోసమే తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు ఎంపీ గురుమూర్తితో కలిసి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైల్వేగేటు మూసేసిన తర్వాత పలువురు ట్రాక్ దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రూ.75.8లక్షల ఎంపీ నిధులు, రూ.1.41 కోట్ల నగర పాలక సంస్థ నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. అభినయ్ రెడ్డి మాట్లాడుతూ నగరవాసుల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఇక్కడ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ అతిథిసింగ్, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డీఆర్‌ఎం వినీత్ సింగ్, రైల్వే డైరెక్టర్ సత్యనారాయణ, కార్పొరేటర్లు రత్నప్రసాద్, ఆంజనేయులు, మురళీకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

కమనీయం.. నృసింహుని కల్యాణం

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చారు. స్వర్ణాభరణాలు, సుగంధ సుమాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కమనీయంగా కల్యాణం జరిపించారు. దేవదేవేరులకు శాస్త్రోక్తంగా సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భవానీ శంకర్ మృతదేహం

పిచ్చాటూరు : స్థానిక బైపాస్ రోడ్డులో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని రామపురం దళితవాడకు చెందిన భవనీశంకర్ అలియస బన్నీ(20) బైక్‌పై పుత్తూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో ముందు వెళుతున్న వేరుశనగ ఒబ్బిడి చేసే వాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొని అదే వేగంతో వెనుక వస్తున్న భవానీ శంకర్ బైక్‌పైకి దూసుకెళ్లింది. దీంతో భవానీశంకర్ అక్కడికక్కడే మరణించాడు. ఒబ్బిడి వాహనం నడుపుతున్న చంద్రశేఖర్ పక్కకు దూకేయడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని భవానీ శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం కూడలి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రోడ్డు పక్కన వెళుతుండగా, జీవాగ్రం కూడలి నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు టవల్ చుట్టుకుని తెల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వివరాలు తెలిస్తే 9440900728 నంబరులో సంప్రదించాలని ఎస్ సూచించారు.

'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం

- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- తిరుపతి రూరల్ మండల నేతలకు దిశా నిర్దేశం


వేదాంతపురంలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: సీఎం జగనన్న 'సిద్ధం' సభను విజయవంతం చేసేందుకు చంద్రగిరి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్దామని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మంగళం, తిరుచానూరు, ముళ్లపూడి, పద్మావతీపురం, వేదాంతపురం, తుమ్మలగుంట పార్టీ డివిజన్ కార్యాలయాల్లో మండల పరిధిలోని పంచాయతీ పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఆదివారం బాపట్ల జిల్లా, అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో జరిగే 'సిద్ధం' సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. గత మూడు సిద్ధం సభలకు ప్రజలు, పార్టీ శ్రేణులు లక్షలాదిగా హాజరయ్యారని, ఈ క్రమంలో ఆదివారం జరిగే నాలుగో సిద్ధం సభకు నియోజవర్గం నుంచి కూడా భారీ సంఖ్యలో తరలివెళ్లేందుకు సిద్ధం కావాలని పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, పంచాయతీ కనీ్వనర్లు, పార్టీ ముఖ్యనాయకలు పాల్గొన్నారు..

సిద్ధం సభకు 150 బస్సులు

చంద్రగిరి నియోజకవర్గం నుంచి 150 బస్సుల్లో పార్టీ శ్రేణులు సిద్ధం సభకు తరలివెళ్లనున్నారు. ఈ మేరకు పంచాయతీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సిద్ధం సభకు వెళ్లి తిరిగి వచ్చే వరకు ఫైవ్ మెన్ కమిటీ ఏర్పాటుతో బాధ్యతలు అప్పగించారు.

ప్రారంభోత్సవాల జాతర

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఈనెల 11, 12, 13 తేదీలలో ప్రారంభించాలని తుడా చైర్మన్ సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి పంచాయతీలో రూ.3 కోట్లకు తక్కువ కాకుండా అభివృద్ధి పనులు చేపట్టారని, ఈ క్రమంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పలు ప్రారంభోత్సవాలు చేపట్టాలని నిర్ణయించారు.

విజ్ఞానానికి మూలం.. సంస్కృతం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : సంస్కృతమే విజ్ఞానానికి మూలమని, అందులోని శాస్త్రీయ, వైజ్ఞానికతను నేటి తరానికి అందించాల్సి బాధ్యత అందరిపై ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో రెండు వారాలుగా ఎడ్యుకేషన్ రీసెర్చ్ మెథడాలజీ అంశంపై నిర్వహించిన సదస్సు శనివారంతో ముగిసింది. వీసీ మాట్లాడుతూ సంస్కృతంలో నిగూఢమైన అంశాలు ఉన్నాయని, వాటిని నిశతంగా పరిశీలించాల్సి అవసరం ఉందన్నారు. ఆధునిక కాలంలోని విజ్ఞానాన్ని కొన్ని వేల ఏళ్లకు పూర్వమే సంస్కృతంలో వివరించారని వెల్లడించారు. అనంతరం కాంచీపురం ఎస్‌సీఎస్వీఎమ్‌వీ వర్సిటీ డీన్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. సదస్సులో వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్‌జీ త్రిపాఠి, ప్రొఫెసర్ కలైఅరసి, పి.వెంకట్రావు, ఎస్వీయూ రిజిస్ట్రార్ రమాశ్రీ, ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఉమానరసింహమూర్తి, ప్రొఫెసర్ దక్షణమూర్తి శర్మ పాల్గొన్నారు.

నాగలాపురం కానిస్టేబుళ్లపై యువకుల దాడి

నాగలాపురం: మండలంలో బీరకుప్పం సమీపంలోని భూపతీశ్వర కోన శివాలయంలో బందోబస్తుకు వెళ్లిన కానిస్టేబుళ్లపై శనివారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు దాడి చేశారు. బాధితుల కథనం మేరకు.. శివరాత్రి సందర్భంగా భూపతీశ్వర కోన శివాలయంలో జాగరణ చేసే భక్తుల కోసం శుక్రవారం రాత్రి మహాభారతం నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐ ఓబయ్య చర్యలు తీసుకున్నారు. కానిస్టేబుళ్ల రఘు, కృష్ణను బందోబస్తు కోసం పంపించారు. ఈ నేపథ్యంలో బీరకుప్పం హరిజనవాడకు చెందిన గౌతమ్, జీవన్, ప్రతాప్ అనే యువకులు ఆలయం వద్ద కేకలు వేయడంతోపాటు భక్తులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో కానిస్టేబుళ్ల రఘు, కృష్ణ వారిని మందలించారు.

అనంతరం కానిస్టేబుళ్లు శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు నాగలాపురం పోలీసు స్టేషన్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో గౌతమ్, జీవన్, ప్రతాప్ వారిని అడ్డుకున్నారు. అంతు చూస్తామని, చంపకుండా వదలం అని పేర్కొంటూ దాడికి దిగారు. స్థానికులు అక్కడికి చేరుకోవడంతో వారు పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు దుండగులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

వైభవంగా పల్లికొండేశ్వరుడి కల్యాణం


కల్పవృక్ష వాహన సేవలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నాగలాపురం: సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం స్వామి వారి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు కార్తికేయన్ గురుక్కల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు యాగశాల మండపంలో పూజలు చేసి సర్వమంగళ దేవి, వాల్మీకీశ్వర స్వామిని విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఊత్తుకోటైకి చెందిన సీఎన్‌సీ ప్రభాకర్ శెట్టి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, ఈవో కె.రామచంద్రారెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు ఆనందయ్య, రాధాకృష్ణ, మునివేలు, చిత్ర, ఎస్ఎం సురేష్ పాల్గొన్నారు.

కోనేరులో పడి చిన్నారి మృతి

నారాయణవనం: మండలంలోని సింగిరికోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరులో ప్రమాదవశాత్తు పడి 18 నెలల చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ, ఈశ్వర యానాది కాలనీకి చెందిన సాయికుమార్, ద్రాక్షాయని దంపతుల కుమార్తె జ్ఞానం(18 నెలలు)తో కలిసి సింగిరి కోనలోని లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వెళ్లారు. ఆలయ సమీపంలోని జలపాతంలో స్నానానికి వెళ్లగా ప్రమాదశాత్తు చిన్నారి జలపాతం వద్ద కొనేరులో పడిపోయింది. ఆస్పత్రికి తరలిస్తుండగా జ్ఞానం మార్గమధ్యంలో మృతిచెందింది.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం


బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం చేశారు. అనంతరం దేవదేవేరులతో కలిసి బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ పాల్గొన్నారు.

మత్స్యకారులకు మంచి రోజులు


బోటు ద్వారా తీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ

వాకాడు: మండలంలోని మత్స్యకారులకు త్వరలోనే మంచి రోజులు వస్తున్నాయని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నవాబుపేట గ్రామం వద్ద రూ.248 కోట్లతో ఈనెల 12న సముద్ర పూడికతీత, టూరిజం, ఫిషింగ్ ల్యాండ్ పాయింట్ పనులకు సంబంధించి సీఎం చేతుల మీదుగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కలెక్టర్, ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పలువురు జిల్లా ఉన్నతధికారులు ఆ ప్రాంతాన్ని బోటులో వెళ్లి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ నవాబుపేటలో మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ ఉన్నందున మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి సముద్ర ముఖద్వారాల పూడికతీత, టూరిజం, ఫిషింగ్ ల్యాండ్ పాయింట్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. దీంతో ఈ ప్రాంత మత్స్యకార గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. తాను మాటలు చెప్పడం కన్నా అభివృద్ధి చేసి చూపించడం తన అలవాటన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో అటవీ ఆంక్షల కారణంగా రహదారులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. అలాగే తీర గ్రామాలలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. నిడిగుర్తి గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పేద ప్రజల బాగుకోసం సీఎం జగనన్న అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. వాకాడు మండలం, నవాబుపేట చుట్టుపక్కల 32 గ్రామాలు అభివృద్ధి చెందనున్నట్టు వెల్లడించారు. నవాబుపేట వద్ద శాశ్వత ముఖద్వారంతోపాటు 500 బోట్లు పెట్టుకోవడానికి ఫిషింగ్ ల్యాండ్ పాయింటును ఏర్పాటు చేస్తామన్నారు. తీర ప్రాంత అభివృద్ధికి దాదాపు రూ.20 వేల కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం సీఎం జగనన్న ఎన్ని అడుగులైనా ముందుకేస్తారని, ఆయన్ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్ కుమార్, నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, వెంకటరత్నం, శేషారెడ్డి, డీ.అజిత్‌కుమార్‌రెడ్డి, మత్స్యశాఖ, మెరైన్, అటవీశాఖ, ఆర్అండ్‌బి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.